క్లుప్తంగా

ఆరుబయట వేడుకలకు అనుమతులు లేవు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): డిసెంబర్ 31వ తేదీ రాత్రి సమయంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనే వారు జాగ్రత్తగా ఉండాలని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ సిహెచ్ వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి ఆరు బయట వేడుకలను అనుమతులు లేవని, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 144 అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురు కన్నా ఎక్కువ మంది గుమికూడరాదని, మద్యం సేవించి వాహనాలపై నడపరాదని, నడిరోడ్డుపై కేకులు కట్ చేసి అల్లర్లు సృష్టించరాదని సూచించారు. మండల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పోలీసుల గస్తీ ముమ్మరంగా నిర్వహించనున్నామని అన్నారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసివేసి అధిక శబ్దాలతో హోరెత్తించినా, డీజెలు మరియు ఎక్కువ శబ్దాన్ని విడుదలచేసే సౌండ్ సిస్టంను వినియోగించినా అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్గశిర మాసం ఎంతో పవిత్రమైనదని, దైవభక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంతో ఉండాలని ప్రబోధించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యులు టి.వి. కృష్ణారావు, బి.శివలింగం నాయక్, జె.హరిబాబు, సుబ్బారావు, గోపి, ఎ.అన్నపూర్ణ, ఎస్‌కె దిల్‌షా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు



తాడికొండ: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తుళ్ళూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు అన్నారు. తుళ్ళూరు మండలం రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అధిక శాతం మంది హెల్మెట్ లేని వారే అన్నారు. దీనిపై గౌరవ హైకోర్టు సూచనల మేరకు తాము ప్రజలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని లేదంటే భారీ జరిమానాలు ఉంటాయని సూచించారు. పలువురు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిటీ ఎన్‌జీఓ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తాడేపల్లిరూరల్: ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్ బాబు ఉత్తర్వుల మేరకు గుంటూరు డివిజన్ ఎన్నికల ప్రక్రియను ఆదివారం మంగళగిరిలో అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ది సిటీ ఎన్‌జీవో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడిగా ఎం.నాగరాజు, సహాధ్యక్షులుగా డి.ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా బి.రాధిక, ఎస్.సాజిద్ అలీ, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కార్యాలయ కార్యదర్శిగా డి.రామకృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా టి.బాపూజీ, బి.ఏడుకొండలు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ ప్రక్రియకు ఎన్నికల అధికారిగా కేఆర్‌ఎస్ గణేష్, సహాయ ఎన్నికల అధికారిగా అడపా రవి, పరిశీలకులుగా ఆర్.వినోద్ కుమార్‌లు వ్యవహరించారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి గణేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.

దోమతెరలు పంపిణీ

తెనాలి: అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీఎస్సార్ కాలేజీ ఎదురుగా కళెవరం కాల్వకట్టపై నివసిస్తున్న సంచార జాతులకు చెందిన ఎనిమిది కుటుంబాలకు ఉచితంగా దోమతెరలను పంపిణీ చేశారు. రెవరెండ్ విక్టర్ పాల్ సహకారంతో సంస్థ నిర్వాహకులు డాక్టర్ పల్లికొండ రవికుమార్ వీటిని అందజేశారు. లబ్ధిదారులు దోమతెరలను తప్పక ఉపయోగించుకుని, దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. 'క్లాప్స్' సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గోవిందు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. సోషల్ వర్కర్ బడుగు రత్నకుమార్ మాట్లాడుతూ అగాపే లవ్ ట్రస్ట్ సేవలనుఅభినందించారు. ట్రస్ట్ సభ్యులు గంగోలు శ్రీలత, పల్లికొండ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఏం కొనేటట్టు లేము..!

- సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ధరాభారం
- చుక్కలు చూస్తున్న వంట నూనెలు, పప్పులు, కూరగాయల ధరలు
- అల్లాడిపోతున్న పేదలు



మార్కెట్లో కూరగాయలు కొంటున్న మహిళలు

మేడికొండూరు: మండిపోతున్న కూరగాయల ధరలతో పాటు నిత్యావసరాలైన పప్పులు, నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిన్న చిన్న ఉద్యోగాలు, కూలి పనులు చేసుకొని జీవించే సగటు మనిషి మీద ఈ ధరల ప్రభావం మరింతగా పడి, వారి జీవితాలను అతలాకుతలం చేస్తుంది. పెరిగిన ధరలతో సామాన్యుడు పచ్చడి మెతుకులతో సరిపెట్టు కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

పేదలకు ధరాఘాతం..

ప్రస్తుత దినాల్లో చిన్న ఉద్యోగాలు చేసుకొనే చిరుద్యోగులు, రోజు వారీ పనులు చేసుకొనే కూలీలు, పేదలు బతుకీడ్చడం కష్టంగా మారుతోంది. దళారీ వ్యవస్థ వలన నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దళారీలు సిండికేట్‌గా మారి రైతుల దగ్గర అతి తక్కువ రేటుకు కూరగాయలు కొని వాటిని నాలుగింతల రేట్లకు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇక నిత్యావసర వస్తువులైన పప్పులు, నూనెలు, చింతపండు వాటిని దళారీలు కొని వాటి నిల్వలను బ్లాక్ చేస్తున్నారు. ఆ తరువాత ఆ వస్తువుకు డిమాండ్ పెరిగిన తరువాత వాటిని శీతల గిడ్డంగుల నుంచి తరలించి మార్కెట్లో విపరీతంగా ధరలు పెంచి అమ్ముతున్నారు. ఈపరిణామాల మధ్య సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనలేక తినలేక నలిగి పోతున్నారు.

నిత్యావసరాల ధరలు ఇలా..

వస్తువు	కిలో (రూ.)
శనగ నూనె	170
సన్‌ఫ్లవర్ నూనె	155
పామాయిల్	135
కందిపప్పు	160
మినప్పప్పు	130
పచ్చిపప్పు	110
శనగపప్పు	110
వెల్లుల్లి	400
ఎండు కొబ్బరి	200
కూరగాయలు..	(కిలో రూ.లలో)
వంకాయలు	40
దొండకాయలు	60
బెండకాయలు	40
బంగాళాదుంపలు	40
క్యారెట్	60
బీట్‌రూట్	60
క్యాబేజీ	40
చిక్కుడుకాయ	40
దోసకాయ	40
టమాట	30



కిరాణా దుకాణంలో నిత్యావసర వస్తువులు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలపై ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. లేదంటే కూలి పనులు చేసుకొనే వారి పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదీ కొనలేకుండా ఉన్నాము. గతంలో మార్కెట్‌కు వెళితే రూ.వంద పెడితే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.వెయ్యికి కూడా సంచి నిండటం లేదు.

– ఎ.అనుష, గృహిణి

ధరలు మండిపోతున్నాయి



ఒక నిత్యావసర వస్తువులే కాకుండా కూరగాయల ధరలు సైతం మండి పోతున్నాయి. బహిరంగ మార్కెట్లో వారు ఎంత చెబితే అంతకు తీసుకోవాలి తప్పితే బేరాలు అడిగే పరిస్థితి కూడా లేదు. నెల నెలా వచ్చే సంపాదనతో పిల్లల చదువులు, ఇంటి అద్దె, రోజువారీ ఖర్చులు, పాలు వీటన్నిటికి సరిపోను నిత్యావసర వస్తువులు కొందామని వెళితే డబ్బులు సరి పోవటం లేదు.

– టి.దేవ, చిరుద్యోగి, మేడికొండూరు

ఖర్చు అంచనాలు దాటుతోంది..



చిన్న ఉద్యోగం చేస్తున్నాను. నెలవారీ జీతం వచ్చేసరికి కిరాణా, పాలు, కూరగాయలు, ఇంటి ఖర్చులకు పోను కాస్త మిగిలేది. ఇది గతంలో పరిస్థితి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంత పొదుపు చేసినా చేతిలో నుంచి డబ్బులు వెళ్లిపోతున్నాయే తప్ప మిగిలించలేని పరిస్థితి. ఈరోజు ఉన్న ధరలు మార్కెట్లో రేపు ఉండటం లేదు. పెరగటమే తప్ప తగ్గే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

– కరిముల్లా, చిరుద్యోగి, మేడికొండూరు

పశుగణన సర్వే పూర్తి



ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లో జాతీయ పశుగణన సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని నుదురుపాడులో సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీనాబాద్, రేపూడి, 113 త్యాళ్లూరు, తక్కెళ్లపాడు, యర్రగుంట్లపాడు, బేతపూడి, పొనుగుపాడు, మేరికపూడి, వేమవరం, గుండాలపాడు, నుదురుపాడు గ్రామాల్లోని ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి యజమాని పేరు, ఇంటిలోని సభ్యులు, వారికి ఉన్న జంతువులు, పశువుల వివరాలు సేకరించి వాటిని యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన ఏడు గ్రామాల్లో వారు వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. ఇప్పటివరకు నూటికి నూరు శాతం పూర్తిఅయిందని చెప్పారు. 2019లో నిర్వహించిన సర్వే ప్రకారం పశువులు 15,200, జీవాలు 10,400 ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో మిగిలి ఉన్నవారి వివరాలను నమోదు చేస్తామని ఈసర్వే ఫిబ్రవరి 28 తుది గడువుగా కేంద్రప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

రేపు పెన్షన్ల పంపిణీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సామాజిక పెన్షన్‌లను ఒక రోజు ముందుగానే అందజేయనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2025 జనవరి 1వ తేదీన నూతన సంవత్సరం రావడంతో జనవరి నెల పెన్షన్‌ను 2024 డిసెంబర్ 31వ తేదీన అందజేస్తామని, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 31వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు పెన్షన్‌ను పంపిణీ చేస్తామని తెలిపారు. పెన్షన్ దారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి సకాలంలో పెన్షన్ తీసుకోవాలని ఆయన సూచించారు.

మంగళగిరిలో మెగా వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంగళగిరి పట్టణ ఎస్‌ఐ రవీంద్ర నాయక్

తాడేపల్లిరూరల్: మానవ సేవా సంస్థ, అంజుమాన్ ఇ హిమాయత్తుల్లా ఇస్లాం సంయుక్తంగా ఆదివారం మంగళగిరిలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అక్రమ విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మంగళగిరి పట్టణ ఎస్‌ఐ రవీంద్ర నాయక్ వైద్యశిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకుని మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందజేసేందుకు మానవ సేవా సంస్థ, అంజుమన్ ఇ హిమాయత్తుల్లా ఇస్లాం సంస్థలు ముందుకు రావడం అభినందనీయని అన్నారు. మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ మాట్లాడుతూ అంజుమన్ సంస్థతో మంగళగిరి మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, వైద్యులు వంశీ, శ్రావణి, నిఖిల్, శశిధర్, అర్చన, వినోద్, శ్రీకర్, వహీద్, బాషా తదితరులు తమ వైద్యసేవలను అందించారని, అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని తెలిపారు. సుమారు 30 మందికి కంటి ఆపరేషన్లు చేయించనున్నామని అన్నారు. మానవ సేవా సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, నరసింహారావు, హనుమంతరావు, విజయ్‌బాబు, పూర్ణ, అంజుమాన్ సభ్యులు అనిషా, హలీం, సుభాని, యాసిన్, అక్బర్ బాషా, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

- 113 మందికి కంటి పరీక్షలు,
- 62 మంది శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక



రావెలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి వైద్య బృందం

రావెల(తాడికొండ): తాడికొండ మండలం రావెల గ్రామంలో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. గ్రామానికి చెందిన నందమూరి రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 113 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 62 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని శంకర కంటి ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత బస్సులో ఆసుపత్రికి తీసుకెళ్ళి అపరేషన్ అనంతరం తీసుకొచ్చి ఇంటివద్ద వదిలి పెట్టడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు దేవరపల్లి చినపాములు, పాటిబండ్ల సీతారామయ్య, కోమటి పుల్లారావు, కొలుకుల ఇన్నారెడ్డి, భీమవరపు సత్యనారాయణ రెడ్డి, కర్రి మార్కు, షేక్ బుడే సాహెబ్, వలేటి వెంకటేశ్వరరావు, కోమటి సాంబశివరావు, మొక్కల గంగరాజు, కుంభా చిన్నబ్బాయి, డాక్టర్ సుకత, రవి, ఆసుపత్రి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉచిత నేత్ర వైద్యసేవలు అభినందనీయం



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులు రహీమ్ బాషా

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఎంఎంకే స్టేడియంలో హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఆకుల జయసత్య, తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావులు విచ్చేశారు. ఈ సందర్భంగా జయసత్య మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న సూక్తిని అనుసరించి హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వారు పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ వైద్య శిబిరంలో హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రహీమ్ బాషా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వారికి కంటి పొరలు, కంటి శుక్లాల ఆపరేషన్లను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్యసేవలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం ఇన్‌చార్జి కొత్తపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఎంటీఎంసీ కార్యదర్శి తిరుమలశెట్టి మురళీకృష్ణ, స్టేడియం ప్రతినిధులు మాచర్ల శ్రీనివాసరావు, వుడతా శ్రీనివాసరావు, కొల్లి పూర్ణ, సైదా నాయక్, నాగేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మృత్యు మలుపు!



పేరేచర్ల డొంక నుంచి నర్సరావుపేట వైపు వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మలుపు

మేడికొండూరు: స్థానిక పేరేచర్ల డొంక నుంచి నర్సరావుపేట వైపు వెళ్లే రహదారిలో మలుపు ప్రమాదాలకు కారణమవుతుంది. మలుపులో రహదారి మీద స్పీడు బ్రేకర్లు లేకపోవటం, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయక పోవటం వలన వాహనదారులు విపరీతమైన వేగంతో వస్తున్నారు. ఒక్కోసారి పెద్ద వాహనాల ధాటికి ద్విచక్రవాహనదారులు భీతిల్లుతున్నారు. ఇక రాత్రిళ్లు పరిస్థితి భయానకంగా ఉంటుందని ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలియదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ వేగ నిరోధకాలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అనధికార పర్మిట్ రూమ్ తొలగింపు

- నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 'నగరంలో మద్యం పరవళ్లు' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించారు. కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో వైన్స్‌షాపు పక్కన పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారని ఆ కథనం ఫొటోతో సహా ప్రచురణ కావడంతో స్పందించిన ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్స్‌షాపు వద్దకు వెళ్లి పర్మిట్ రూమ్ కోసం వైన్స్ యజమానులు చుట్టూ ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్‌తో పాటు మద్యం సేవించేందుకు ఏర్పాటు చేసిన బల్లలను తొలగించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వైన్స్ షాపులకు మద్యం అమ్మడానికే అనుమతులు ఇచ్చిందని, ఆ నిబంధనల ప్రకారం షాపు యజమానులు అమ్మకాలు నిర్వహించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, వైన్స్‌షాపులకు పక్కన పర్మిట్ రూమ్‌లు గానీ, వాటర్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్‌లు అమ్మేందుకు అనుమతి లేదని అలా ఎవరైనా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే వెంటనే 9440902469 నెంబరుకు సమాచారం అందజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వీరాంజనేయులు తెలిపారు.

అయ్యప్పస్వామికి విశేషపూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి మార్గశిర చతుర్దశిని పురస్కరించుకొని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అష్టోత్తర, సహస్ర నామాలతో అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రమాదకరంగా గుంత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తూర్పుబజారులోని బొడ్రాయి సెంటర్ వద్దనున్న కాలువ గుంతపై వరదిమ్మెలు వేయకుండా నాపరాయి బండలు వేయడంతో అవి పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం పలు వాహనాలు ఆరోడ్డుపై వెళుతుంటాయి. ఇటీవల కాలువలో మురుగుతీసేందుకు గుంతపైన ఉన్న దిమ్మెను తొలగించారు. మురుగు తీసిన తరువాత బండలు వేశారు. కానీ వాటిలో నడిరోడ్డుపై ఉన్న బండ పూర్తిగా పగిలిపోయింది. దీంతో రోడ్డుపై రాత్రిళ్లు సైకిళ్లపై వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతపై బండల స్థానంలో మందపాటి వరదిమ్మెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారం కాకుంటే జిల్లావ్యాప్త ఉద్యమం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారాన్ని కోరుతూ పోరాడుతున్నా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని, ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదని, అవసరమైతే జిల్లావ్యాప్తంగా కార్మికుల కోసం ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఆదివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుకోవాలని కోరుతున్నామన్నారు. సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, ఇ.నరసింహారావు, ఎస్.దుర్గారావు, పోరాట కమిటీ నాయకులు కె.స్టీవెన్, ఆదినారాయణ, ఆశీర్వాదం, కార్మికులు పిచ్చయ్య, సుబ్బారావు, సాంబశివరావు, శారద, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి ఏటీపీఎం ఉన్నత పాఠశాలలో 1985–85 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 80 మంది పూర్వ విద్యార్థులకు గాను 50 మంది విద్యార్థులు విచ్చేశామని, సుమారు 20 మంది పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మరణించడం బాధాకరమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల హెచ్‌ఎం బిల్లా ప్రకాష్ మాట్లాడుతూ హైస్కూల్‌లోని కంప్యూటర్స్ ప్యానల్స్‌కు కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పూర్వ విద్యార్థి సిహెచ్ రమేష్ రూ.5లక్షలు విరాళం అందజేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్య నేర్పిన గురువు సాంబిరెడ్డి మాస్టార్‌ను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు వడ్డేశ్వరపు రాజు, ఈపూరి దేవదాస్, కనపాల సుధాకర్, బాపనపల్లి రవికుమార్, శివబ్రహ్మం, కొదమల శిరీష, ఈపూరి బసవయ్య, శృంగారపాటి దాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలందరు ఐక్యంగా కృషి చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నాయకుడు వేముల దుర్గారావు అధ్యక్షత వహించగా, పాశం రామారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను వ్యంగ్యంగా విమర్శిస్తూ మాట్లాడిన హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవినుంచి తొలగించాలని, లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని అన్నారు. సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, వాడవాడలా బెల్టు షాపుల్ని పెట్టి మద్యం విక్రయాలను విచ్చలవిడిగా చేస్తున్నారని అన్నారు. తాడేపల్లి పట్టణ సీనియర్ నాయకుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల సమస్యలను మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని అన్నారు. నాయకులు వేముల వెంకన్న, ఎస్‌కె రహంతాబి, వేముల రమణ, విజయ్‌బాబు, వి. శాస్త్రి, దేవకుమార్, జానీ, ఆఫీజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో నేడు హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాలయం ముఖ మండపంపై 30వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు హుండీ కానుకల లెక్కింపు ప్రారంభం కానున్నదని, అనంతరం మిద్దె సెంటర్‌లోని శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానంలో కూడా హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నామని, లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్ద హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.